సాక్షి తిరుపతి

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
మంగళం తిరుమలనగర్ పంచాయతీలోని ప్రభుత్వ భూమిలో టీడీపీ నేతలు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. - IIలో



కల్పవృక్షాధి'రాజ'..కాంక్షలు తీర్చగ రాగ!
తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వ భూపాల వాహనంపై విహరించారు. - IIలో



బాధ్యతగా విధులు నిర్వర్తించండి
గరుడోత్సవంలో విధులు కేటాయించిన సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని సీఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదేశించారు. - IIలో



కల్పవృక్ష వాహనసేవలో పాల్గొన్న జనం(ఇన్‌సెట్) కల్పవృక్షవాహనంపై మలయప్పస్వామి

కృష్ణాలంకృతుడై..తృష్ణవల్లభుడై..!

ఓ పక్క రుక్మిణి..మరో పక్క సత్యభామ.. మురళీలోలుడు బకాసురుడిని వధిస్తూ భక్తులకు కనువిందు చేశారు. స్వర్ణతేజోమయంగా కాంతులీనుతున్న సర్వభూపాలుడిని అధిరోహించిన స్వామి సకల భూపాలురకు తానే అధిపతినని.. తన భిక్షే రాజ్యాధికారమని సందేశమిచ్చారు. అంతకుముందు కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షంపై రాజమన్నార్ అవతారంలో వచ్చి భక్తులకు అభయమిచ్చారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన శనివారం కల్పవృక్ష, సర్వభూపాల వాహనసేవలు నిర్వహించారు. తిరుమాడ వీధుల్లో భక్తులు మలయప్పను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. వాహనసేవల ముందు కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

– తిరుమల



సర్వభూపాల వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప



బిందెలతో కళాకారుల నృత్యం



వాహనసేవలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన



డప్పు కొట్టి నృత్యం చేస్తున్న ఈఓ

న్యూస్‌రీల్

4 వరకు చివరి దశ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలలో వచ్చేనెల 4వ తేదీ వరకు చివరి దశ అడ్మిషన్లకు నమోదు ప్రక్రియ కొనసాగనున్నట్లు పీజీ సెట్ కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఉంటుందని, 6వ తేదీన వెబ్‌ఆప్షన్ల మార్పు, 8వ తేదీన ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయ కళాశాలలో వచ్చేనెల 11వ తేదీ లోపు రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపీరు.

3 నుంచి నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

- శిక్షణ అనంతరం పోస్టింగ్ ఆర్డర్లు

తిరుపతి సిటీ: డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3 నుంచి 10వ తేదీ వరకు ప్రాథమిక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రటనలో తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాకాధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో అధికారులు ఆ మేరకు ఏర్పాటు చేశారు. జిల్లాలో తిరుపతి జీవకోనలోని విశ్వం స్కూల్‌లోనూ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లోనూ, మెడ్‌జీ స్కూల్‌లోనూ కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. దీంతోపాటు గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలోనూ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక్కో స్కూల్‌లో సుమారు 250 నుంచి 500 మంది వరకు కెపాసిటీ ఆధారంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. శిక్షణలో ప్రాధానంగా విద్యా బోధనలో మెలుకువలు, ఉపాధ్యాయుల బాధ్యత, ఎన్ఈపీ–2025, పాఠశాలల ప్రణాళికలు తయారు చేయడం, బోధనా పద్ధతులు, మూల్యాంకన, డిజిటల్ విద్యాబోధన, వృత్తినైపుణ్యం, విద్యార్థులకు ఆదర్శంగా నిలవడం, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వంటి విషయాలపై నిపుణులు, అధికారులు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు అధికారులు అందించనున్నారు.

పుంగనూరు : నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కూటమి అరాచకాలను ఎండగడుదాం

కూటమి అరాచకాలను ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ నడుంబిగించింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల సైన్యాన్ని సిద్ధం చేసేందుకు ఉపక్రమించింది. శనివారం పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రెడ్‌బుక్ ఆగడాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయించి చట్టం ముందు నిలబెట్టే చర్యలకు శ్రీకారం చుట్టనున్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, తిరిగి జగనన్న పాలనను తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రతి నెలా 'జగనన్న'తో ముఖాముఖి

- పుంగనూరు నుంచే కార్యక్రమం ప్రారంభం
- గ్రామస్థాయి నుంచే కమిటీలు ఏర్పాటు
- ఎర్రాతివారిపల్లె విస్తృత స్థాయి సమావేశం
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసుకుంటూ కార్యకర్తలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించే కార్యక్రమాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి రాగానే పుంగనూరు నుంచి ప్రారంభిస్తారని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పార్టీకి 18 లక్షల మంది క్రియాశీలక సైన్యం ఉందని ధీమా వ్యక్తం చేశారు. పుంగనూరు నియోజకవర్గం, సదుం మండలం, యర్రాతివారిపల్లెలో శనివారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన పుంగనూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఇంకా తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రి నారాయణస్వామి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నిసార్ అహ్మద్, వెంకటేగౌడ్, డాక్టర్ సునీల్‌కుమార్, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

- **కమిటీలకే పూర్తి బాధ్యత**

అనంతరం వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. 'పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేశాం. గ్రామ కమిటీలకే పూర్తి బాధ్యత. పుంగనూరు నియోజకవర్గంలోని 112 గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి వచ్చాక ఈ కార్యక్రమం ఉంటుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డిజిటల్ నోట్‌బుక్‌లో అన్ని విషయాలు నమోదు చేసుకోవచ్చు' అని అన్నారు.

- **పొరబాట్లు జరగనివ్వను**

ఆకేపాటి అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. 'గతంలో జరిగిన పొరపాట్లు ఈ సారి జరగనివ్వను. ఈసారి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మీ ద్వారానే ప్రభుత్వం నడవనుంది' అని చెప్పారు.

- **విద్య, వైద్యం నిర్వీర్యం**

మాజీ మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ.. 'ఈవీఎంల గాలిలో కూడా పుంగనూరు ప్రజలు పెద్దిరెడ్డిని గెలిపించారు. మీరు జగనన్న సైనికులు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యాన్ని నిర్వీర్యం చేసింది' అని ధ్వజమెత్తారు. రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాకు ఆదర్శం. కార్యకర్తలను ఏ విధంగా చూసుకోవాలో పెద్దిరెడ్డే నిదర్శనం. మనం పుంగనూరుని రోల్‌మోడల్‌గా తీసుకుందాం. మా నియోజకవర్గంలో కూడా ఇదే ఫార్ములాను అమలు చేస్తాను' అని పేర్కొన్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, పెద్దిరెడ్డి, కొండవీటి నాగభూషణం, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ, సునీల్, కురుముట్ల శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఆకేపాటి అమరనాథరెడ్డి, సమన్వయకర్తలు నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి, రాజేష్, విజయానందరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్ పాల్గొన్నారు.

దోచుకుంటున్న కూటమి

ముందుగా సజ్జల మాట్లాడుతూ..'ప్రజలకు సంక్షేమం అందించడమే అజెండాగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగింది. సంస్థాగతంగా పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాం. భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. కార్యకర్తల పాత్ర ప్రత్యక్షంగా ఉంటుంది. వైఎస్ జగన్ చేసే యజ్ఞంలో మనం క్రియాశీలక పాత్రదారులం కావాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని దోచుకుంటోంది. ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ మేము ఉన్నాము అని చెప్తున్నారు' అని అన్నారు. ఓట్లను తొలగించడం, వ్యవస్థలను మేనేజ్ చేయడం చంద్రబాబుకు తెలుసు. ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలి. బూత్ లెవల్‌లో నిత్యం పరిశీలిస్తూ ఉండాలి. ఎల్లో మీడియా, సోషల్ మీడియా గ్లోబల్ ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగతంగా దాడికి రెడ్ బుక్ ఉపయోగించారు. మనం డిజిటల్ బుక్‌ను లాంచ్ చేశాం' అని చెప్పారు.


కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం

భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ..'రాష్ట్రంలో అన్ని కమిటీలు నియమించిన మొట్టమొదటి నియోజకవర్గం పుంగనూరు నియోజకవర్గం. రాబోయే జగనన్న ప్రభుత్వంలో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం. జగనన్న మాటగా గ్రామస్థాయిలో తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మీపై ఉంది' అని అన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి , చిత్రంలో సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కరకంబాడి చెరువు ముంపు భూమిలో వేస్తున్న వెంచర్



భూతాల పాగా

ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. అది ఎలాంటిదైనా తమ ఖాతాలో వేసుకోవడానికి కొందరు బరితెగిస్తున్నారు. చెరువులు..దొరువులు..కాలువలు పోయే.. చివరకు ముంపుభూమినీ అక్రమార్కులు వదలలేదు. రేణిగుంట మండలంలో ఇప్పుడు ఇలాంటి భూమిపైనే కొందరు కన్నేశారు. భారీ వెంచర్ వేసి, విక్రయానికి సిద్ధపడ్డారు.

చెరువు ముంపు భూమిలో భారీ వెంచర్

- వెంచర్‌కు భూమి పూజ చేసిన ప్రైవేట్ వ్యక్తులు
- భూమి పూజలో పాల్గొన్న ప్రభుత్వాధికారులు, కూటమి నేతలు
- రూ.కోట్లు విలువ చేసే 20 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- రేణిగుంట మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: రేణిగుంట మండలంలో యథేచ్ఛగా భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు కోట్లాది రూపాయల విలువైన భూములను ఆక్రమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. విలువైన ప్రభుత్వ, పోరంబోకు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిసినా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. రేణిగుంట మండలం తిరుపతి మహానగరానికి ఆనుకుని ఉండే మండలం. అన్ని జాతీయ రహదారులు కలిసే ప్రాంతం, అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేజంక్షన్ ఉన్న చిన్నపాటి పట్టణం. తిరుపతితోపాటు రేణిగుంట కూడా అత్యంత విలువైన ప్రాంతంగా మారింది. తిరుపతి నగరంలో నివాస స్థలాలు దొరకని, కొనుగోలు చేయలేని వారు రేణిగుంటపై దృష్టి సారించారు. అందుకే రేణిగుంట మండలంలో భూములు, నివాస స్థలాలకు అత్యంత డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకుని కూటమి నేతలు అధికారుల సహకారంతో యథేచ్ఛగా ఆక్రమణలకు తెగబడుతున్నారు. వారం రోజులుగా జీపాళ్యెం రెవెన్యూ పరిధిలో విలువైన మేత పోరంబోకు భూమిని ఆక్రమించి, నిర్మాణాలు సాగిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. తాజాగా కరకంబాడి చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి, విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

కల్వర్టును పూడ్చి దారి ఏర్పాటు

కరకంబాడిలో సగం గ్రామానికి సంబంధించిన మురుగు, వర్షపు నీరు వెళ్లేందుకు తిరుపతి ప్రధాన రహదారిలో ఆర్ అండ్ బీ అధికారులు కల్వర్టు ఏర్పాటు చేశారు. పై నుంచి వచ్చే నీరు కల్వర్టు నుంచి కిందకు వెళ్లి చెరువులోకి చేరుతాయి. ప్రస్తుతం ముంపు భూమిలో లేఔట్ వేసిన వారు కల్వర్టు కింద భాగం మొత్తం పూడ్చి వేసి ప్లాట్లకు దారి వేసుకున్నారు. పంచాయతీకి సంబంధించిన కాలవను ఎందుకు పూడ్చారని అడగాల్సిన పంచాయతీ అధికారులే లేఔట్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనటం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు.

కొంటే ముప్పు తప్పదు..

మండలంలో ఉన్న చెరువుల్లో కరకంబాడి చెరువు అతి పెద్ద చెరువు. అలాంటి పెద్ద చెరువు ముంపు ప్రాంతంలో ప్లాట్లు విక్రయించి ఇళ్లు కట్టుకుంటే కచ్చితంగా ముప్పు తప్పదని ఇరిగేషన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇవేవీ పట్టించుకోని బయట వ్యక్తులు కూటమి నేతల సహకారంతో ప్లాట్లు విక్రయించి, సొమ్ముచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొనుగోలుదారులు అందులో నివాసాలు ఏర్పాటు చేసుకుంటే భారీ వర్షాల వస్తే ముంపునకు గురికాక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దర్జాగా ఆక్రమించి.. భూమి పూజ

రేణిగుంట మండలంలోని కరకంబాడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 340, 341, 342, 167, 168లో సుమారు 20 ఎకరాల చెరువు ముంపు పట్టా భూమి ఉంది. చెరువులో నీళ్లు తగ్గినప్పుడు ఆ భూమిలో వ్యవసాయం చేసుకునేందుకు గతంలో రైతులకు ముంపు పట్టాలు మంజూరు చేశారు. అదే పట్టాలను పెట్టుకుని కొందరు వ్యక్తులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని చదును చేశారు. అందులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు లే అవుట్ వేసి, రంగం సిద్ధం చేశారు. అందులో శనివారం ముంపు భూమిలో వేసిన లేఔట్‌లో భూమి పూజ ఘనంగా నిర్వహించారు. టెంట్లు వేసి విక్రయ దారులను ఆకర్షించేలా భోజనాలను కూడా ఏర్పాటు చేశారు. వెంచర్ వేయడానికి భూమి పూజ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులతోపాటు పంచాయతీ అధికారులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ముంపు భూమిలో ఎటువంటి కట్టడాలు కట్టరాదని నిబంధనలున్నా వాటిని లెక్కచేయకుండా ప్రైవేట్ వెంచర్ దారులు స్థానిక అధికారుల సహకారంతో దర్జాగా పనులు ప్రారంభించారు.



లేఔట్‌కు అడ్డుగా ఏర్పాటు చేసిన రేకులు



లేఔట్‌లో భూమి పూజ కోసం వేసిన షామియానా

రేపటితో ముగియనున్న రెండో విడత అడ్మిషన్ల నమోదు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలల్లో రెండో విడత అడ్మిషన్ల నమోదు ప్రక్రియ ఆదివారంతో ముగియనుంది. ఇప్పటికే తొలివిడత అడ్మిషన్లలో సీట్లు పొందలేని విద్యార్థులు రెండో విడతలో సీట్లు పొందేందుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. వెబ్ ఆప్షన్లకు వచ్చేనెల ఒకటో తేదీ వరకు అవకాశం కల్పిస్తూ, వచ్చే నెల 3న వెబ్‌ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. 6వ తేదీన రెండో విడత సీట్లు కేటాయించి విద్యార్థుల సెల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు పంపనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు వచ్చేనెల 7వ తేదీన ఆయా కళాశాలల్లో ధ్రువపత్రాలతో రిపోర్ట్ చేయాలని అధికారులు తెలిపారు.

కల్పవృక్షాధిరాజ..కాంక్షలు తీర్చగ రాగ!


కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్‌గా కల్యాణ వెంకన్న


కనువిందు చేస్తున్న కోలాట ప్రదర్శన

- కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై కల్యాణ వెంకన్న విహారం
- అలరించిన భజన బృందాలు, కోలాటాలు


వేద పఠనం చేస్తూ అలరిస్తున్న వేదపాఠశాల పిల్లలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన శనివారం ఉదయం రాజమన్నార్ అలంకారంలో శ్రీనివాసుడు కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించారు. భక్తజన బృందాలు, చెక్క భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షంపై కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకుని తరించారు. వాహన సేవలో వేద పాఠశాల విద్యార్థులు చేసిన వేద పఠనం ఆకట్టుకుంది. కల్పవృక్ష వాహనసేవ ముగిసిన తరువాత ఉదయం 11.30 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

సర్వభూపాలునిపై శ్రీనివాసుని వైభవం

బ్రహ్మోత్సవాల్లో నాలుగోరోజైన శనివారం రాత్రి సర్వభూపాల వాహనంపై కల్యాణ వేంకటేశ్వర స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు సర్వభూపాలవాహన సేవ సాగింది. భక్తులు హారతులు పట్టి, మొక్కులు తీర్చుకున్నారు. వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, చెవిరెడ్డి రఘునాథరెడ్డి, చెవిరెడ్డి మంజుల దంపతులు పాల్గొన్నారు.

గరుడోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- ఉత్సవ కమిటీ సభ్యులతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రసిద్ధిగాంచిన గరుడోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పనిచేయాలని ఆలయ కమిటీ సభ్యులు, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు. శనివారం ఆలయం వద్ద గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గరుడోత్సవానికి ప్రధాన ఆలయంతోపాటు వాహనం తిరిగే వీధుల్లో ప్రత్యేక అలంకరణ చేయాలన్నారు. అలాగే కళాకారులు, భజన బృందాలను మరింతగా పెంచాలని, భక్తులు అందరికీ నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోటుపాట్లను సరిచేసుకుంటూ గరుడోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం గరుడోత్సవ ఏర్పాట్లకు నియమించిన కమిటీలకు బాధ్యతలను అప్పగించారు.

వాహనచోదకులు సహకరించాలి

గరుడోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు గ్రామానికి చేరుకుంటారని, ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి వాహనాలను గ్రామంలోకి అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని, తెలుగుతల్లి విగ్రహం వద్ద నుంచి ఆలయం వరకు బైక్‌లు రోడ్లపై పార్క్ చేయకుండా చూడాలని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కోరారు. అలాగే బైపాస్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను కేవీఎస్ పార్క్ వద్ద నిలబెట్టాలన్నారు. గ్రామంలో నివాసం ఉంటున్న ప్రజలు కూడా తమ ఇళ్ల ముందు వాహనాలను నిలబెట్టకుండా గరుడవాహనం తిరిగేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఇస్కాన్ నుంచి సారె సమర్పణ

ఏటా తుమ్మలగుంటలో జరిగే గరుడోత్సవానికి తిరుపతి ఇస్కాన్ ఆలయం నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఆ మేరకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఇస్కాన్ ప్రతినిధులు సారెను సమర్పించనున్నారు.

గరుడ సేవకు ప్రత్యేక ఏర్పాట్లు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరగనున్న గరుడసేవకు టీటీడీ విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉండే అవకాశముంది. గరుడ సేవ దర్శనం కోసం ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతించేలా అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గరుడ వాహనాన్ని రాత్రి 7 గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా అర్ధరాత్రి ఒంటి గంట వరకు వాహనసేవ సాగేలా ప్రణాళిక రూపొందించారు.

నిరంతరాయంగా అన్న ప్రసాదాలు

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తాం. గ్యాలరీల్లోనూ ఉదయం నుంచి రాత్రి వరకు పులిహోర, టమాట బాత్, బిసిబిల్లా బాత్ తదితర అన్నప్రసాదాల ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.

పటిష్ట బందోబస్తు

బ్రహ్మోత్సవాలకు దాదాపు 1,130 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందితోపాటు 3,600 మంది పోలీసులతో పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. గరుడసేవకు ప్రత్యేకంగా 1200 మంది పోలీసులతో అదనపు భద్రత కల్పించారు. ఆలయ మాడ వీధులు, ఇతర ప్రాంతాల్లో 2,770 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. ఘాట్ రోడ్లలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని శనివారం సాయంత్రం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ రద్దు చేసింది.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

తిరుపతి అర్బన్: శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం గరుడోత్సవాన్ని పురస్కరించుకుని బాధ్యతగా విధులు నిర్వహించాలని చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్(సీఎస్ఐ) వెంకటేశ్వర్లు వెల్లడించారు. నెల్లూరు, కడప, విజయనగరం ఆర్టీసీ జోన్లు పరిధిలో పనిచేస్తున్న 65 మంది సెక్యూరిటీ సిబ్బందిని బ్రహ్మోత్సవాల విధులకు కేటాయించారు. వారందరికీ తిరుపతి ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో శనివారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎస్ఐ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి విచ్చేయనున్న భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. వారి అవసరాల తగు మార్గాలను చూపాలని పేర్కొన్నారు. బస్సులు ఎక్కే సమయంలోనూ, దిగే సమయంలోనూ తోపులాటలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రధానంగా బస్టాండ్‌లో భక్తుల రద్దీ నేపథ్యంలో చోరీలకు అవకాశం ఉంటుందని, పరిస్థితులను ముందే భక్తులకు తెలియజేస్తూ వాటికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తిరుపతి, అలిపిరి బస్టాండ్లతోపాటు తిరుమలలోనూ పలువురికి విధులు కేటాయించాలని తెలిపారు. అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అసిస్టెంట్ చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ ఎస్ వర్మ మాట్లాడుతూ భక్తుల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

తప్పిపోయిన 31 మంది అప్పగింత


చిన్నారిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఇప్పటివరకు తప్పిపోయిన 31 మందిని వారి కుటుంబ సభ్యులకు తిరిగి అప్పగించినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. శనివారం తప్పిపోయిన పదిమంది భక్తులను అప్పగించామన్నారు. అందులో ఆరుగురు చిన్నారులు, నలుగురు వృద్ధులు ఉన్నారన్నారు. వీరందరినీ జియో ట్యాగ్ ద్వారా గుర్తించి వారి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 22,500 మందికి జియోట్యాగ్‌ను కట్టామన్నారు. విద్యుత్ ఎంతగానో దోహపడుతుందని పేర్కొన్నారు. గరుడసేవ రోజు వచ్చే చిన్నారులు, వృద్ధులకు జియోట్యాగ్ వినియోగించాలని కోరారు.

జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించాలి

– ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి: ప్రతి వినియోగదారుడికి జీఎస్టీ2.0పై అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో తగ్గిన జీఎస్టీ అమలు తీరుపై పట్టణంలోని బజారువీధిలో ఉన్న బజాజ్ ఎలక్ట్రానిక్స్, శరవణ బిగ్ బజార్, ఓంకార్ బుక్ షాప్‌లను ఆకస్మిక తనిఖీ చేసి దుకాణ యజమానులు, వినియోగదారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 అమలుపై అవగాహన కల్పించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులు అన్నీ ప్రజలందరికీ అందుతున్నాయా? లేదా అనే అంశంపై నెలరోజులపాటు పట్టణంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అనే వినూత్నమైన కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో భాగంగానే శ్రీకాళహస్తి పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎలక్ట్రికల్ పరికరాలపై ముఖ్యంగా టీవీలు, ఏసీలు, ఎయిర్ కండిషనర్, వాషింగ్ మిషిన్లపై ఇప్పటివరకు ఉన్న 28 జీఎస్టీ 18 శాతానికి తగ్గిందన్నారు. అలాగే స్టేషనరి ఉన్న 12 శాతం జీఎస్టీ జీరో శాతానికి తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, జీఎస్టీ 2.0 జిల్లా నోడల్ అధికారి, అడిషనల్ కమిషనర్ నాగేంద్ర, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, డీఎల్‌డీఓ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధిలో ఉత్తమ జిల్లాగా తిరుపతి


ఉత్తమ టూరిజం అవార్డును అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: రాష్ట్రంలో ఉత్తమ పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లాగా తిరుపతిని గుర్తించారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అవార్డు దక్కింది. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం చేశారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాకు 8 కేటగిరీల్లో అవార్డులు దక్కాయి. ప్రధానంగా జిల్లాలో పర్యాటకాభివృద్ధికి సంబంధించి హోటళ్లు, రిసార్ట్‌లు, రెస్టారెంట్లు, పర్యాటక ప్రాజెక్టులు, ట్రావెల్ ఏజెన్సీలు, టూర్ ఆపరేటర్లు, జిల్లా స్థాయిలో పర్యాటకాభివృద్ధికి అత్యుత్తమ కృషి చేసిన కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, అవార్డులతో సత్కరించింది. గత ఏడాది కూడా ఉత్తమ టూరిజం జిల్లా అవార్డును కలెక్టర్ అందుకున్నారు. వరసుగా రెండుసార్లు అవార్డు వరించింది.

జిల్లాకు 8 కేటగిరుల్లో ఉత్తమ టూరిజం అవార్డులు

- ఉత్తమ రిసార్ట్‌గా, మాంగో రిసార్ట్ శ్రీసిటీ, సత్యవేడు
- ఉత్తమ స్టార్ హోటల్‌గా, మానస సరోవర్, తిరుపతి
- ఉత్తమ చెఫ్‌గా, భారతీ రాజా తాజ్ హోటల్, తిరుపతి
- ఉత్తమ టూరిస్ట్ డెస్టినేషన్ అర్బన్, రూరల్‌కు సంబంధించి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య
- టూరిజంలో ఉత్తమ జిల్లా అవార్డు
- బెస్ట్ టూరిజం ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్ట్‌గా, రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు
- బెస్ట్ టూరిజం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌గా ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, తిరుపతి
- ఆర్ట్ అండ్ కల్చర్ అవార్డును శ్రీకాళహస్తికి చెందిన దశరథ ఆచారి అందుకున్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు


మంగళం తిరుమలనగర్ పంచాయతీలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్ మండలం మంగళం తిరుమలనగర్ పంచాయతీలో యథేచ్ఛగా టీడీపీ నాయకులు ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తిరుపతి శివారు ప్రాంతాల్లో భూములకు రెక్కలు వచ్చి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళం తిరుమల నగర్ పంచాయతీ జయశంక్‌కాలనీ సమీపంలోని చెన్నాయగుంట లెక్కదాఖలాల 195 సర్వే నంబర్‌లో కొందరు టీడీపీ నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతూ రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. నాలుగు నెలల కిందట కూడా ఆ స్థలంలో టీడీపీ నాయకులు ఆక్రమణలకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే ఆక్రమణలను తొలగించి, మరో సారి అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే మళ్లీ అదే స్థలంలో శనివారం టీడీపీ నాయకులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రెవిన్యూ అధికారులు భారీగా ముడుపులు తీసుకుని అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె


సీఎండీకి సమ్మె నోటీసు అందజేస్తున్న జేఏసీ నేతలు

తిరుపతి రూరల్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేయనున్నట్టు ఏపీ విద్యుత్ ఉద్యోగ సంఘాల సమాఖ్య (జేఏసీ)నేతలు స్పష్టం చేశారు. అక్టోబరు 15 తరువాత ఏ క్షణమైనా ఉద్యోగులు విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళతామని, శనివారం తిరుపతి ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ సంతోషరావును కలసిన జేఏసీ నేతలు సమ్మె నోటీసు అందజేశారు. ఆలోపు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు విధులు బహిష్కరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు దిగితే చీకటి మయమవుతుందన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు, అధికారులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ అక్టోబరు 6వ తేదీ నుంచి దశల వారీగా నిరసనలు వ్యక్తం చేస్తామని, అక్టోబరు 15 తరువాత సమ్మెలోకి వెళ్లతామన్నారు. ఏపీ విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ డిస్కం అధ్యక్షులు దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యాలు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. దీనిపై స్పందించిన సీఎండీ సంతోష రావు ఉద్యోగ సంఘాల తరపున వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, వీలైనంత త్వరగా ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు.